క్లుప్తంగా

ప్రగతి భవన్ పేరు మార్పుపై హర్షం

రామాయంపేట(మెదక్): ప్రగతి భవన్‌ను మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చడంపై బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం, సావిత్రిబాయి పూలే సంఘం జిల్లా అధ్యక్షురాలు పోచమ్మల అశ్విని హర్షం వ్యక్తం చేశారు. పూలే దంపతుల ఆశయాలను నెరవేర్చాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం



శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ కౌన్సిలర్లు

నర్సాపూర్: కామారెడ్డి ఎమ్మెల్యేని నర్సాపూర్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ కౌన్సిలర్లు బుచ్చేష్‌యాదవ్, రాజేందర్‌లు శుక్రవారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కామారెడ్డిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట బీజేపీ నాయకుడు రమణరావు తదితరులు ఉన్నారు.

సంజీవరెడ్డికి స్వాగతం



ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో నారాయణ ఖేడ్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ సంజీవరెడ్డిని మండల నాయకులు ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్‌కు తొలిసారి వచ్చిన ఎమ్మెల్యేను శుక్రవారం స్థానిక నాయకులు సంతోష్, లక్ష్మణ్, హమీద్ కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రశాంత్



ప్రశాంత్

నిజాంపేట(మెదక్): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నిజాంపేటకు చెందిన బండారి ప్రశాంత్ నియమితులయ్యారు. ఏబీవీపీ 69వ జాతీయ మహాసభలను దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన సభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి నియమించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినందుకు రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కమ్మేసిన పొగమంచు



రోడ్డును కమ్మేసిన పొగమంచు

నిజాంపేట(మెదక్): మండల వ్యాప్తంగా శుక్రవారం ఉదయం పొగమంచు కమ్మేసింది. రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్తున్నారు. పొంగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాకింగ్ చేసేవారు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

ఘనంగా శేరారయ జాతర

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్న ఘణాపూర్ గ్రామంలో శ్రీ శేరారయ ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి గురువుగా భావించే శేరారయ ఉత్సవాలు మూడు రోజులపాటు జరపడం ఆనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా రాత్రి రథోత్సవం నిర్వహించారు. యువకులు స్వామి వారి రథాన్ని లాగడానికి పోటీ పడ్డారు. మఠం నుంచి స్వామి వారి సమాధి వద్దకు ఊరేగింపు కొనసాగింది.

భూ కబ్జాపై ఫిర్యాదు

శివ్వంపేట(నర్సాపూర్): సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో భూ కబ్జాపై ఫిర్యాదు చేసినట్లు ఓ రైతు తెలిపాడు. తనది మండలంలోని కొంతన్‌పల్లి గ్రామమని గొల్ల శివయ్య తెలిపాడు. కాగా వంశపారపర్యంగా గ్రామ పరిధిలో పంటలు సాగు చేసుకుంటున్న సర్వే నంబరు 349 లోని సర్వేనంబరు 1–37 గుంటల భూమిని బీఆర్‌ఎస్ నాయకుడు కబ్జా చేశాడని సీఎంకు వివరించినట్లు చెప్పాడు. భూ కబ్జాపై పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపాడు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ యమున



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, అధికారులు

- చాయ్, బిస్కెట్ కోసమేనా సమావేశాలని నిలదీత
- సాదాసీదాగా ముగిసిన మండల సమావేశం

హవేళిఘణపూర్(మెదక్): మండల సమస్యలపై చర్చ, అభివృద్ధి ప్రణాళికలు తదితర అంశాలపై చర్చించేందుకు మూడు నెలలకోసారి ఏర్పాటు చేసే సమావేశానికి సగానికిపైగా అధికారులు గైర్హాజరుకావడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీపీ యమున అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరై మాట్లాడారు. ఎంపీడీఓ శ్రీరాములు మాట్లాడుతూ మండలంలో స్పెషల్ గ్రాంట్, 15వ ఫైనాన్స్ కింద సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చేపట్టనున్న పనులకు ప్రొసిడింగ్‌లు అందజేయడం జరిగిందన్నారు. ఆ పనులు ప్రారంభించేలా చూడాలని ఆయన ప్రజాప్రతినిధులను కోరారు. అందుకు వారు స్పందిస్తూ ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు రాలేదని, అప్పులు చేసి పనులు చేపట్టామని, మళ్లీ పనులు చేపడితే మరింత అప్పుల్లో కూరుకుపోతామని బదులిచ్చారు. సమావేశాలకు అధికారులు రాకుంటే ఎవరితో చర్చించాలని సభ్యులు ప్రశ్నించారు. అనంతరం వెటర్నరీ, హార్టికల్చర్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు మండలంలో చేపడుతున్న పనుల గురించి వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఆంజనేయులు, మెదక్ పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, గ్రామ సర్పంచ్‌లు వికాస్, ఎలక్షన్‌రెడ్డి, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు సహించం



నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

నర్సాపూర్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదని తహసీల్దార్ కమలాద్రి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని 76 సర్వే నంబరులో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా, సొంత భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. సొంత భూమిలో నిర్మాణాలకు నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తే అనుమతులు వస్తాయన్నారు. వారి వెంట మండల ఆర్ఐ ఫైజల్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



నస్కల్ గ్రామంలో అయ్యప్ప పడిపూజచేస్తున్న స్వాములు



రంగంపేట గ్రామంలో..

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో శుక్రవారం గురుస్వామి తీగల ఎర్రగౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ రేణుక ఆలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శబరిమలై అయ్యప్ప దేవాలయ సహాయ అర్చకుడు, గురుస్వామి ఉన్నికృష్ణన్ నంబూద్రి హాజరయ్యారు. కార్యక్రమంలో గురు స్వాములు, గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో శుక్రవారం గ్రామానికి చెందిన కృష్ణ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణ, భజనలు, కీర్తనలతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పడిపూజలో గురుస్వాములు ప్రభాకర్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా, రాచప్ప, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామ దేవతల పూజలు



గ్రామంలో పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్ కీర్తన తదితరులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి ఎదుల్లాపూర్ గ్రామంలో గ్రామదేవతల ఉత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం ఊరలమ్మ బొడ్రాయి, లింగమయ్య ప్రతిష్ఠ నిర్వహించడంతో పాటు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు సర్పంచ్ కీర్తన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవాలు ఈనెల 11 వరకు నిర్వహిస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఉప సర్పంచ్ పాండురంగం, మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, సునందరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కల్లూరి రాజు, యాదిరెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మునగ తోటలకు తీవ్ర నష్టం



రామంచలో మునగతోటలో నేల రాలిన పూత

చిన్నకోడూరు(సిద్దిపేట): తుపాన్ ప్రభావంతో మండల పరిధిలోని రామంచ, చిన్నకోడూరులో మునగ తోటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పూత నల్లబడి నేల రాలిపోయింది. లక్షల్లో నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు తీవ్ర ఇబ్బంది పడుతూ తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. కోతదశకు చేరుకున్న వరి పంట చేనులోనే ఉండడంతో వర్షాలకు నేలరాలి దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మైనంపల్లికి సొసైటీ డైరెక్టర్ల సన్మానం



సొసైటీ సభ్యులకు అభివాదం చేస్తున్న హన్మంతరావు

పాపన్నపేట(మెదక్): మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును శుక్రవారం కొత్తపల్లి రైతుసేవా సహకార సంఘం చైర్మన్ రమేశ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవానికి మెదక్ వచ్చారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గ్రామానికి వచ్చి పలువురు నాయకులను కలిసి మాట్లాడారు.

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు



పూజలు చేస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో కార్యకర్తలతో కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముక్కపల్లి కనకయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, నాయకులు సత్తు రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ధార స్వామి, మల్లయ్య, రమేష్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిని కరీంనగర్‌లో చేర్చాలి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో చేర్చాలని కోరుతూ ఆర్‌టీఐ ప్రచార కమిటీ చైర్మన్, టీజేవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాసూరి మల్లికార్జున్, నాయకులు ర్యాకం రాజు, ఉప్పులేటి శ్రీను, గాదెం మల్లికార్జున్ శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతి పత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. అలాగే మండల కేంద్రంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమి, ఎల్‌పీఎస్ భూములపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్‌రావు

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రతి ఒక్కరికి చట్టాల గురించి తెలిసి ఉండాలని అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాస్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీటీమ్స్, తదితర వాటిపై అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు మగవారితో పోటీపడి ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. కష్టపడి చదవాల్సిన వయసులో చెడు అలవాట్లకు బానిస కావొద్దని సూచించారు. షీటీమ్ కంప్లెంట్ క్యూఆర్ కోడ్ గురించి తెలియజేస్తూ ఆన్‌లైన్ ద్వారా ఎక్కడి నుంచి అయిన ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, సీఐ ఎర్రల కిరణ్, ఎస్సైలు మహేష్, వివేక్, కేజీబీవీ బాలికల పాఠశాల ప్రత్యేకాధికారి సరిత, షీటీం బృందం సదయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



దుబ్బాక ఎమ్మెల్యేతో నార్సింగి బీఆర్‌ఎస్ నాయకుడు రాజేష్



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న స్టేషన్ మాసాయిపేట నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని నార్సింగి బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ టెలీకం బోర్డు సభ్యుడు అంచనూరి రాజేష్ కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నార్సింగి పట్టణ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి భూపతిరాజు, బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన కొత్త ప్రభాకర్‌రెడ్డిని మాసాయిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు వేసి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో స్టేషన్ మాసాయిపేట సర్పంచ్ నర్సింహులు, చెట్ల తిమ్మాయిపల్లి ఉప సర్పంచ్ ముఖేష్ గౌడ్, నాయకులు మోహన్, శ్రీను, పాల్గొన్నారు.

విద్యార్థులకు తినుబండారాల పంపిణీ



తినుబండారాలను పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం రామాయంపేట లయన్స్ క్లబ్ ప్రతినిధులు తినుబండారాలు పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు త్వరలో ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ రషీద్, భగవాన్‌దాస్, శ్రీనివాస్, దేవేందర్, భాగ్యలక్ష్మి, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పారదర్శక పాలన



చేగుంటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో పారదర్శక పాలన సాగనుందని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వడ్ల నవీన్ అన్నారు. చేగుంటలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారంలోనే ప్రజలకు సుపరిపాలనపై భరోసా కల్పించారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మహేశ్, రాజు, ఫకీర్‌నాయక్, వెంకటేశ్, ఆనందరాజు, నర్సింలు, సంతోష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



మెదక్ ఎమ్మెల్యేతో చిన్నశంకరంపేట మండల కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను చిన్నశంకరంపేట మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వంగా కలిశారు. శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిసిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల గోపాల్‌రెడ్డి, చిన్నశంకరంపేట పట్టణ నాయకుడు మేడి గణేష్‌లు కలిసి అభినందించారు. అంతకు ముందు మాజీ ఎంపీపీ అరుణ, చిన్నశంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ జనార్ధన్, బందెల సాయిలు తదితరులు కలిశారు.

సమాచారం లేకుండా కార్యాలయం ప్రారంభించారు

ఉప సర్పంచ్ ధర్మేందర్ ఆరోపణ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కోనాయపల్లి(పీటీ)లో గడా నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తమకు సమాచారం లేకుండా సర్పంచ్ ప్రభావతి ప్రారంభించారని ఉప సర్పంచ్ ధర్మేందర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తనకు సమాచారం ఇవ్వకుండా నూతన పంచాయతీ కార్యాలయాన్ని ఎలా ప్రారంభిస్తారన్నారు. సర్పంచ్‌ని వివరణ కోరగా పాలకవర్గం కోరిక మేరకే ప్రారంభించామన్నారు.



నూతన గ్రామ పంచాయతీలో సమావేశం నిర్వహిస్తున్న సర్పంచ్ ప్రభావతి

ట్రెక్కింగ్ క్యాంపులో ఎన్‌సీసీ కాడెట్లు

గజ్వేల్‌రూరల్: ట్రెక్కింగ్ క్యాంప్ తమకు ఎన్నో అంశాలను నేర్పించిందని, ఈ క్యాంపు వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందిందని ఎన్‌సీసీ కాడెట్లు పేర్కొన్నారు. 2టీ బెటాలియన్ సికింద్రాబాద్‌కు చెందిన ట్రెక్ 23లో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సీపీఎల్ సాయిచరణ్, ఎన్‌సీపీఎల్ శౌర్య చైతన్య నవంబర్ 5వ తేదీ నుంచి డిసెంబర్ 5 వరకు గుజరాత్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ క్యాంపులో ఎన్‌సీసీ కాడెట్ల బాధ్యతల గురించి తెలుసుకుంటూ వివిధ ప్రాంతాల్లో ట్రెక్ నిర్వహించారు. ఈసందర్భంగా శుక్రవారం సెయింట్ మేరీస్ పాఠశాలలో క్యాంపులో పాల్గొన్న ఎన్‌సీసీ కాడెట్లను ఆ పాఠశాల డైరెక్టర్ థామస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాయప్ప అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.